సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 8 । జూన్ । 2024



రూ.లక్ష విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలాజీ ఆలయ అన్నదానం ట్రస్టుకు నేదునూరి శేషగిరి, పాలెపు బేబీ అన్నపూర్ణ దంపతులు (రాజమహేంద్రవరం) రూ.లక్ష విరాళంగా ఇచ్చారు.



సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి జి.వేంకట సత్యనారాయణ (కాతేరు) రూ.1,00,001 విరాళాన్ని శుక్రవారం సమర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
38.0° / 26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	38.0	26.0
కాకినాడ	32.1	26.5
అమలాపురం	30.0	28.0

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్తగా కార్తీక్



అమలాపురం టౌన్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల ఇన్‌చార్జి సమన్వయకర్తగా (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ కె.కార్తీక్ నియమితులయ్యారు. ఇంతకాలం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్తగా పనిచేసిన డాక్టర్ పద్మశ్రీరాణి తూర్పుగోదావరి జిల్లా డీసీహెచ్‌ఎస్‌గా బదిలీపై వెళ్లారు. అమలాపురంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో డాక్టర్ కార్తీక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం ఆసుపత్రిలో ఎండీ జనరల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని డాక్టర్ కార్తీక్ తెలిపారు.

17 నుంచి భీమేశ్వరస్వామి దర్శనాలు



సామర్లకోటలో బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం

సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోటలో వేంచేసి ఉన్న పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనానికి అనుమతి ఉంటుందని ఆలయ ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆలయంలోని శివలింగానికి జరుగుతున్న జీర్ణోద్ధరణ పనులు పూర్తి కాలేదని, దాంతో సెంట్రల్ ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మరింత సమయం కావాలని కోరిందన్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 8వ తేదీ నుంచి స్వామివారి గర్భాలయ దర్శనం ఇవ్వవలసి ఉందని చెప్పారు. అయితే ఈ నెల 15వ తేదీ వరకూ పనులు ఉంటాయని చెప్పడంతో దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు. 16వ తేదీన ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించి, 17వ తేదీ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గర్భాలయంలో పునః దర్శనానికి ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ధ్వజ స్తంభం మీదుగా నంది మంటపం వద్ద ఏర్పాటు చేసిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను దర్శనం చేసుకోవచ్చని చెప్పారు.

సత్యదేవుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని ఆలయం వద్ద క్యూలో భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం శుక్రవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారి వ్రతాలు 1,800 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు నాలుగు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

ముగిసిన పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మూల్యాంకనం



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ వాసుదేవరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసిందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు శుక్రవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో స్పాట్ వాల్యుయేషన్ ఈ నెల 6న ప్రారంభం అయ్యిందని, ఆ కేంద్రాన్ని పరిశీలించామన్నారు. 145 మంది ఉపాధ్యాయులను ఈ స్పాట్‌కు నియమించామన్నారు. తొలిసారిగా గణితం పేపర్ వాల్యుయేషన్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారని, మిగిలిన సబ్జెక్టులకు ఇక్కడ మూల్యాంకనం చేశారన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ మూల్యాంకన కేంద్రాన్ని పర్యవేక్షించారు.

కేబినెట్‌పై వ్యూహాగానాలు

- అమాత్య యోగం ఎవరికో?
- ఆశల పల్లకీలో తెలుగు తమ్ముళ్లు
- లాబీయింగ్ మొదలు
- బెర్త్‌లు ఖాయమనే ధీమాలో సీనియర్లు
- సామాజిక సమతూకాలపై మల్లగుల్లాలు



కందుల దుర్గేష్



గోరంట్ల బుచ్చయ్య చౌదరి



యనమల రామకృష్ణుడు



జ్యోతుల నెహ్రూ



నిమ్మకాయల చినరాజప్ప



అయితాబత్తుల ఆనందరావు



దేవ వర ప్రసాద్



బండారు సత్యానందరావు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎన్నికలు ముగిశాయి. ఫలితాలు వెలువడ్డాయి. టీడీపీ అధికారం చేజిక్కించుకుంది. ఇప్పుడు ఆ పార్టీలో అందరి కళ్లూ కేబినెట్ కూర్పుపైనే ఉన్నాయి. మంత్రివర్గం ఎలా ఉండబోతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికన తీసుకుంటారా, సామాజిక సమతూకాల మాటేమిటి, కూటమిలో క్రియాశీలకమైన జనసేనకు లభించే ప్రాతినిధ్యం ఎంతవరకూ ఉంటుంది. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో చర్చ అంతా ఈ అంశాలపైనే జరుగుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని స్థానాల్లోనూ టీడీపీ, జనసేన అభ్యర్థులు గెలుపొందడంతో మంత్రివర్గంపై ఆశలు పెంచుకున్న వారి జాబితా చాంతాడులా మారుతోంది. పార్టీ సీనియర్‌లు ఈసారి కేబినెట్‌లో బెర్త్ ఖాయం చేసుకోవాలని లాబీయింగ్ చేయడంలో బిజీబిజీగా గడుపుతున్నారు. మంత్రివర్గంలో బెర్త్ కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సీనియర్‌లంతా రేసులో ఉన్నారు. పార్టీలో నంబర్ టుగా పేర్కొనే యనమల రామకృష్ణుడు సహా నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జ్యోతుల నెహ్రూ, బండారు సత్యానందరావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. స్పీకర్, ఆర్థిక మంత్రిగా పనిచేసిన యనమల ప్రత్యక్ష రాజకీయాలకు దూరమై మండలిలో ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నారు. ఈసారి ఎన్నికల్లో ఆయన కుమార్తె దివ్య తుని నుంచి ఎన్నికయ్యారు. మండలి నుంచి మంత్రివర్గంలోకి యనమలకు బెర్త్ దక్కితే సరేసరి లేదంటే కుమార్తె దివ్య రేసులో ఉండటం ఖాయమంటున్నారు. గత చంద్రబాబు కేబినెట్‌లో ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రిగా చేసిన పెద్దాపురం సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కూడా మంత్రివర్గంలో ప్రాతినిధ్యాన్ని కోరుకుంటున్నారు. వివాదరహితుడనే పేరున్న చినరాజప్ప రెండో సారి ప్రయత్నాల్లో ఉన్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా మెట్ట ప్రాంత రాజకీయాల్లో చక్రం తిప్పిన జ్యోతుల నెహ్రూ ఈసారి బెర్త్ ఖాయం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. మంత్రి అనిపించుకోవాలనే ఆత్రం ఎవరికి మాత్రం ఉండదని నెహ్రూ సన్నిహితులు చెబుతున్నారు. పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు నవీన్ ఇప్పటికే లోకేష్‌ను కలిసి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు.

బుచ్చయ్యకు ఈసారైనా దక్కేనా?

రాజమహేంద్రవరం రూరల్ నుంచి గెలుపొందిన సీనియర్ నాయకుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేరు కూడా కేబినెట్ రేసులో ప్రచారంలోకొచ్చింది. ఉమ్మడి తూర్పు గోదావరిలో అందరి కంటే సీనియర్ అయిన తనకు బెర్త్ ఖాయమనే ధీమాతో బుచ్చయ్యచౌదరి ఉన్నారు. దివంగత ఎన్టీఆర్ హయాంలోనే పౌర సరఫరాలు వంటి కీలక శాఖలు చేసిన తమ నేతకు ఈసారి మంత్రివర్గంలో చోటు కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నామని అనుచరులు బాహాటంగానే చెబుతున్నారు. బుచ్చయ్యకు పోటీగా సిటీ ఎమ్మెల్యేగా ఎన్నిక అయిన ఆదిరెడ్డి వాసు కూడా రేసులో ఉన్నారు. ఆది నుంచీ సిటీ సీటు విషయంలో గోరంట్ల...ఆదిరెడ్డి వర్గాల మధ్య వైషమ్యాలు ఉన్న విషయం బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో వాసు కోటరీ లోకేష్ ద్వారా బెర్త్ కోసం పావులు కదుపుతున్నారు. ఇప్పటికే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, చిన్న మావ అయిన అచ్చెన్నాయుడుతో చంద్రబాబుకు సిఫార్సు చేయించుకుంటున్నారు అని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వీరితోపాటు కొత్తపేట నుంచి బండారు సత్యానందరావు, ఎస్సీ, బీసీ కోటాలో అమలాపురం అయితాబత్తుల ఆనందరావు, కాకినాడ నుంచి వనమాడి కొండబాబు అమాత్య పదవి కోసం పావులు కదుపుతున్నారు.

యనమల హవా నడుస్తుందా?

మంత్రివర్గం కూర్పులో సామాజికవర్గాల సమతూకమే ప్రామాణికంగా ఉంటుందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు కాపు, బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల నుంచి మూడు బెర్త్‌లు ఖాయం కావచ్చనే ప్రచారం టీడీపీలో జరుగుతోంది. అదే నిజమైతే సీనియర్‌ల మధ్యనే పోటీ ప్రధానంగా ఉంటుందని నేతలు విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి జిల్లా టీడీపీ రాజకీయాల్లో ఆది నుంచి యనమల, జ్యోతుల వర్గాలకు పొసగని పరిస్థితి. ఆది నుంచీ జ్యోతుల మంత్రి పదవికి మోకాలడ్డుతున్నది యనమల వర్గమేనని ఆయన సన్నిహితులు పేర్కొంటుంటారు. ఈసారి ఏమి జరుగుతుందో చూడాలంటున్నారు. గతంలో మాదిరి కేబినెట్ కూర్పులో యనమల హవా నడుస్తుందా లేదా మారిన సమీకరణలు ఎవరికి ప్లస్ అవుతాయో వేచి చూడాల్సిందేనంటున్నారు.

కాపుల నుంచే పోటీ ఎక్కువ

ప్రధానంగా కాపు సామాజికవర్గం నుంచి పోటీ ఎక్కువగా ఉండేటట్టు కనిపిస్తోంది. ఇటు టీడీపీ, అటు జనసేనలో ఈ సామాజికవర్గం నుంచి అమాత్య పదవిని ఆశిస్తున్నవారు ఎక్కువగా ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలో జనసేన అధ్యక్షుడు పవన్ పోటీ చేసిన పిఠాపురం సహా రాజోలు, పి.గన్నవరం, నిడదవోలు, కాకినాడ రూరల్, రాజానగరం స్థానాల్లో కాపు సామాజిక వర్గీయులు గెలుపొందారు. వీరిలో మొదటి ప్రాధాన్యంగా నిడదవోలు నుంచి గెలుపొందిన కందుల దుర్గేష్‌కు చాన్స్ లభించవచ్చునంటున్నారు. ఆవిర్భావం నుంచి పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా దుర్గేష్‌పై పవన్‌కు ఉన్న గుడ్ లుక్స్ కేబినెట్‌లో చోటుకు సానుకూల అంశంగా మారుతుందంటున్నారు. పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి అంటూ జరుగుతోన్న ప్రచారమే నిజమైతే ఉమ్మడి జిల్లాలో కాపు సామాజిక వర్గం నుంచి మరొకరికి అవకాశం లభించడం కష్టమేనంటున్నారు. ఉమ్మడి తూర్పున జనసేనలో ఎస్సీల నుంచి పవన్ ప్రతిపాదించాలనుకుంటే రాజోలులో గెలుపొందిన దేవ వరప్రసాద్ పేరు మొదటి వరుసలో ఉంటుందంటున్నారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలో గెలుపొందిన ఏకైక రాజోలు చీకటిలో చిరుదీపంగా నిలిచిందంటూ పవన్ ఆ నియోజకవర్గం పార్టీకి ప్రత్యేకం అని చెప్పుకొచ్చారు. అందునా రిటైర్డ్ ఐఏఎస్‌గా, పార్టీ జనవాణి కార్యక్రమ కోఆర్డినేటర్‌గా వరప్రసాదరావు వైపే పవన్ మొగ్గు చూపుతారంటున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌గా చంద్రబాబు హయాంలో పనిచేయడంతో వరప్రసాదరావుకు అటు టీడీపీ నుంచి కూడా సానుకూలం అవుతుందంటున్నారు. టీడీపీలో ఎస్సీ సామాజికవర్గం నుంచి అమలాపురంలో గెలుపొందిన ఆనందరావు పేరు తెరమీదకు వచ్చింది. కానీ కాకినాడ జిల్లాకు పొరుగున ఉన్న పాయకరావుపేట నుంచి గెలిచిన అదే సామాజిక వర్గానికి చెందిన వంగలపూడి అనితకు అవకాశం దక్కవచ్చునంటున్నారు.

మలేరియాతో తస్మాత్ జాగ్రత్త

రాజమహేంద్రవరం రూరల్: మలేరియా జ్వరం.. ఈ పేరు చెబితేనే గ్రామాల్లో చాలామంది ప్రజలు వణికిపోతారు. నెలల తరబడి జ్వరం పీడిస్తూ ఉండటమే కారణం. ఇది సోకిందంటే ఒక పట్టాన తగ్గదు. కొన్ని సందర్భాల్లో మరణాలూ సంభవిస్తాయి. గత ఏడాది ఆరుగురు మలేరియా, 119 మంది డెంగీ బారినపడగా ఈ ఏడాది మలేరియా కేసు ఒకటి కూడా లేదు. 11 మంది డెంగీ బారినపడ్డారు. ఈ నేపథ్యంలో మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏటా జూన్ నెలను యాంటీ మలేరియా మాసంగా ప్రకటించారు.

వ్యాధి లక్షణాలు

మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే దోమకాటు వల్ల వస్తుంది. వర్షాకాలంలో దోమలు పెరిగే ప్రదేశాలు ఎక్కువ అవ్వటం వల్ల ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లునొప్పులు, మూత్రం మందగించటం, లివర్, కడుపులో నొప్పి, జ్వరం మూడు రోజులకొకసారి లేదా రెండు రోజులకొకసారి లేదా రోజు మార్చి రోజు వస్తూ ఉండటం ఈ వ్యాధి లక్షణాలు.

ఉచితంగా నిర్ధారణ పరీక్షలు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ గంట వ్యవధిలోపు చేస్తారు. రక్తపు పూతలు సేకరించి వ్యాధి నిర్ధారణ జరిగితే క్లోరోక్విన్, ప్రైమాక్విన్ అనే మాత్రలను ఇస్తారు. ఇవి 14 రోజులు ఆపకుండా తప్పనిసరిగా వాడాలి. ఈ మందులన్నీ ఉచితంగా అందిస్తారు. న్యూడ్రగ్ పాలసీ 2012 ప్రకారం తప్పనిసరిగా 14 రోజులు మందులు వాడాలి.

దోమలు పెరగకుండా జాగ్రత్తలు

ఇంటి పరిసరాలలో దోమలు పెరిగేందుకు ఆస్కారం లేకుండా మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలి. ప్రతి శుక్రవారం వారానికి ఒకసారి ఇంటిలో నీటి నిల్వలు లేకుండా డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి చిప్పలు, కొబ్బరి బొండాలు, పాతటైర్లు, రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమలు ఇళ్లలోకి రాకుండా నియంత్రించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. లెట్రిన్ పైపులకు పైన వస్త్రాన్ని కప్పి ఉంచాలి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వాడటం ద్వారా దోమకాటు బారినపడకుండా కాపాడుకోవచ్చు.

కట్టుదిట్టంగా పోలీసు బందోబస్తు


- జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతం
- సిబ్బందికి ఎస్పీ శ్రీధర్ అభినందన



అమలాపురం టౌన్: జిల్లాలో కట్టుదిట్టంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం ద్వారా సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించామని జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ అన్నారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, కేంద్ర బలగాలు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులను శుక్రవారం ఆయన అభినందించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎస్పీ శ్రీధర్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించిందన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యపరుస్తూ దాదాపు 80 రోజుల పాటు పోలీసు అధికారులు, కేంద్ర బలగాలు కవాతులు నిర్వహించి పోలీసు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి మన జిల్లాకు వచ్చిన 13 కంపెనీల కేంద్ర సాయుధ బలగాల పాత్ర అభినందనీయమన్నారు. జిల్లా పోలీసు శాఖ ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని పని చేసిన తీరు వల్లే ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని చెప్పారు. కౌంటింగ్ పూర్తయినప్పటికీ ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావు లేకుండా కవాతులు, పోలీసు పికెటింగ్‌లు, పెట్రోల్, మొబైల్, క్విక్ రీయాక్షన్ టీమ్‌ల విధులను కొనసాగిస్తున్నామని ఎస్పీ వివరించారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లాలోని మండపేట, అంగర తదితర పోలీస్ స్టేషన్ల పరిధిల్లో కేంద్ర బలగాలతో ఆయా ప్రాంతాల పోలీసు అధికారులు కవాతులు నిర్వహించారని గుర్తు చేశారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అల్లర్లు సృష్టించాలని ప్రయత్నించినా, సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టినా బాధ్యులపై జిల్లా పోలీసు శాఖ తీవ్రమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇలానే మరికొన్ని రోజులు నిఘా కొనసాగుతుందన్నారు.

పంపా బ్యారేజీకి కొత్త గేట్లు

- రూ.మూడు కోట్లు అవుతుందని అంచనా
- ఖరీఫ్ నాటికి గేట్లకు తాత్కాలిక మరమ్మతులు
- అనంతరం కొత్తవి ఏర్పాటు
- గోదావరి డెల్టా చీఫ్ ఇంజినీర్ సతీష్‌కుమార్



పంపా బ్యారేజీ

అన్నవరం: తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 12,500 ఎకరాలకు సాగునీరు అందించే అన్నవరంలోని పంపా రిజర్వాయర్ బ్యారేజీ ఐదు గేట్లనుమార్చాలని నిర్ణయించినట్టు గోదావరి డెల్టా చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్ కుమార్ తెలిపారు. ఇందుకోసం రూ.మూడు కోట్ల వ్యయమవుతుందని గతంలో అంచనా వేసినట్టు తెలిపారు. అయితే ఈ గేట్ల మార్పు పనులు ఈ ఖరీఫ్ సీజన్ అనంతరం మొదలు పెడతామని వివరించారు. అంతవరకు గేట్లకు తాత్కాలిక మరమ్మతులు చేస్తామని వివరించారు. శుక్రవారం ఆయన ఇరిగేషన్ శాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావుతో కలిసి పంపా బ్యారేజీని సందర్శించారు. పెద్దాపురం ఇరిగేషన్ సెక్షన్ ఇన్‌చార్జి ఈఈ డి.శేషగిరిరావు వారికి బ్యారేజీ గురించి వివరించారు. అనంతరం గోదావరి డెల్టా చీఫ్ ఇంజినీర్ ఆర్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలానికి ముందు, వర్షాకాలం తరువాత వివిధ నీటిప్రాజెక్టులను పరిశీలిస్తామన్నారు. అందులో భాగంగా పంపా బ్యారేజీ పరిశీలించానని వివరించారు. పంపా బ్యారేజీ నిర్మించి సుమారు 50 సంవత్సరాలు పూర్తయిందని, అప్పటి టెక్నాలజీ ప్రకారం అర్ధ చంద్రాకారంగా గేట్లు నిర్మించారన్నారు. అయితే ఆ గేట్ల కొంచెం వంగడంతో గేట్ల నిర్వహణ సమయంలో ఇబ్బంది ఎదురవుతోందని తెలిపారు. భారీ వర్షాల సమయంలో బ్యారేజీ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరి, సముద్రానికి నీరు విడుదల చేయాల్సిన పరిస్థితిలో పంపా గేట్లు ఎత్తేటపుడు అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు.

గత ఏడాది డిసెంబర్‌లో ఇదే విధంగా భారీ వర్షాల సమయంలో బ్యారేజీ గేట్లు ఎత్తినపుడు నాలుగో నంబర్ గేటు కిందకు దిగకపోవడంతో దానిని బలవంతంగా కిందకు దించాల్సి వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు రాకుండా ఉండేందుకుగాను గేట్లు మార్చాలని నిర్ణయించామన్నారు.

పనితీరు పరిశీలన

ఆదివారం పంపా గేట్లను పూర్తిస్థాయిలో పరిశీలించనున్నట్టు ఆయన తెలిపారు. శుక్రవారం పంపా గేట్ల నిర్వహణకు విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల వాయిదా వేశారు. కేవలం బ్యారేజీని పరిశీలించారు.

పంట కాల్వ గేట్లు మార్పు

పంపా బ్యారేజీ నుంచి ఆయకట్టుకు నీరు విడుదల చేసే స్లూయిజ్ గేట్లు రెండింటిని మార్చి కొత్త గేట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పాత గేట్లలో ఒకటి పూర్తిగా పాడవ్వగా రెండో గేటు కూడా పాక్షికంగా పాడయిందన్నారు. దీంతో రెండు గేట్లు తొలగించి కొత్తవి ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

బస్సెక్కుదాం.. బడికి పోదాం

- 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచితం
- పాస్‌ల రెన్యువల్‌కు ప్రజా రవాణా శాఖ కసరత్తు
- త్వరలో ప్రభుత్వ పాలసీ ప్రకారం కొత్త దరఖాస్తులు
- గతేడాది జిల్లాలో 51,242 మందికి ప్రయోజనం


రాయవరం: ఆర్టీసీ బస్సెక్కి బడికెళ్లే విద్యార్థులకు శుభవార్త.. ప్రతి ఏడాది మాదిరిగానే బస్‌పాస్‌ల రెన్యువల్‌కు ప్రజా రవాణా శాఖ కసరత్తు ప్రారంభించింది. వివిధ ప్రాంతాల నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల ద్వారా గమ్యస్థానాలకు చేరుకుంటారు. ఈ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులకు ప్రజా రవాణా శాఖ ఏటా ఉచిత, రాయితీ బస్ పాస్‌లను మంజూరు చేస్తుంది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలు 12 నుంచి ప్రారంభమయ్యే అవకాశముంది. ఈ నెల 1వ తేదీ నుంచి కళాశాలలు పునః ప్రారంభమయ్యాయి.

చదువుకు ఊతం

జిల్లాలోని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం ఆర్టీసీ డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత, రాయితీ బస్ పాస్‌లను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థుల చదువులకు ఊతమిచ్చేలా ఏటా ప్రజా రవాణా శాఖ బస్ పాస్‌లు అందిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా గతేడాది మంజూరు చేసిన రాయితీ బస్ పాస్‌ల రెన్యువల్ చేపడుతున్నారు. కొత్తగా పాస్‌ల జారీ ప్రక్రియను ప్రభుత్వ పాలసీ ప్రకారం విడుదల చేసే అవకాశముంది. రెండు నెలల సెలవుల తర్వాత విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజా రవాణా శాఖ బస్ పాస్‌ల రెన్యువల్ కౌంటర్లు ప్రారంభించింది. పలువురు విద్యార్థులు బస్సులపై రాకపోకలు సాగించి, చదువును కొనసాగిస్తుంటారు. అటువంటి వారికి బస్సు పాస్‌లను జారీ చేస్తున్నారు.

ఎవరికి ఇస్తారంటే..

ప్రజా రవాణా సంస్థ ఏటా విద్యార్థులకు ఉచిత పాస్‌లు అందజేస్తోంది. అక్షరాస్యతా శాతాన్ని పెంచేందుకు 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచితంగా పాస్‌లను జారీ చేస్తుంది. ఇది ఏడాది వరకూ చెల్లుబాటు అవుతుంది. ఈ పాస్‌ల ద్వారా విద్యార్థులు తమ నివాసం నుంచి 20 కిలోమీటర్ల వరకూ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందుకుగాను విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి (బోనఫైడ్ సర్టిఫికెట్), ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. మిగతా వారికి రాయితీపై పాస్‌లు మంజూరు చేస్తారు. పాస్ ధరతో పాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100, నెలవారీ గుర్తింపు కార్డు రూ.50, సర్వీస్ చార్జీ రూ.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ బస్ పాస్‌లు నెల, మూడు నెలలు, ఏడాది కాలపరిమితితో మంజూరు చేస్తారు. గడువు ముగిశాక రెన్యువల్ కోసం ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని తిరిగి పొందాల్సి ఉంటుంది. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకూ, ఐటీఐ, పారా మెడికల్ వంటి కోర్సులు చదివే వారికి మే నెలలో కూడా పాసులు మంజూరు చేస్తారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక స్టేజీగా పరిగణనలోకి తీసుకుని దూరాన్ని బట్టి రాయితీ ఇస్తారు. రామచంద్రపురం, రావులపాలెం, రాజోలు, అమలాపురం డిపోల నుంచి గతేడాది ఉచిత, రాయితీ, దివ్యాంగుల బస్‌పాస్‌లు 51,242 వరకూ జారీ చేశారు.



డిపో	ఉచిత పాస్‌లు	రాయితీ పాస్‌లు	దివ్యాంగులు
అమలాపురం	9,104	4,832	1,164
రామచంద్రపురం	8,100	5,971	1,417
రావులపాలెం	8,426	3,707	1,578
రాజోలు	3,221	2,596	1,126

దివ్యాంగులకు..

ఆర్టీసీ దివ్యాంగులకు ఉచిత పాస్‌లు అందజేస్తోంది. వీరు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. మూడేళ్ల కాల వ్యవధితో పాస్‌లు జారీ చేస్తారు. ఐడీ కార్డుకు రూ.100 చెల్లించాలి.

విద్యార్థులకు రాయితీ

చదువుకునే ప్రతి విద్యార్థి రాయితీ బస్ పాస్ పొందవచ్చు. చార్జీలో ఒక వంతు మాత్రమే విద్యార్థి చెల్లించేలా ఈ పాస్‌లు జారీ చేస్తారు. విద్యార్థి నివాసం నుంచి 50 కిలోమీటర్ల వరకూ రాయితీ పాస్ జారీ చేస్తారు. కళాశాల నుంచి (బోనఫైడ్ సర్టిఫికెట్) సమర్పించాలి. విద్యార్థి ఫొటో జత చేయాలి. విద్యార్థి నెలవారీ, మూడు నెలలకోసారి, సంవత్సరం పాస్‌లు పొందవచ్చు. నెలవారీ పాస్ ఐడీ కార్డులకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

పొందే విధానం ఇదీ

ప్రజా రవాణా సంస్థ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలి. కొత్తగా దరఖాస్తు చేసుకునే కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ జత చేయాలి. స్టడీ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సెల్ నంబరు ఇవ్వాలి. దరఖాస్తులను సమీప ఆర్టీసీ డిపో మేనేజర్ పరిశీలించి పాస్ మంజూరుకు సిఫార్సు చేస్తారు. వీటిని మంజూరు కౌంటర్‌లో ఇచ్చి నిర్ణీత రుసుం చెల్లించి పాస్ పొందవచ్చు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వం పాలసీ ప్రకారం ఆర్టీసీ అధికారులు కొత్త బస్‌పాస్‌లు జారీ చేసే అవకాశముంది. ఈ నెల 12వ తేదీ తర్వాత దీనిపై విధి విధానాలు వెలువడే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి గతేడాది మంజూరు చేసిన బస్‌పాస్‌లు రెన్యువల్ చేసే ప్రక్రియలో అధికారులు నిమగ్నమయ్యారు.

రెన్యువల్‌కు మాత్రమే అవకాశం



కళాశాలలు ప్రారంభమైనందున బస్ పాస్‌ల రెన్యువల్ ప్రక్రియ చేపడుతున్నాం. ప్రభుత్వం అందించే బస్సు పాస్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. 50 కిలోమీటర్ల పరిధి వరకూ రాయితీ బస్సు పాస్‌లు జారీ చేస్తున్నాం. సదరం సర్టిఫికెట్ పొందిన దివ్యాంగులకు 50 శాతం రాయితీతో పాస్‌లు ఇప్పటి వరకూ జారీ చేస్తున్నాం. ప్రభుత్వం జారీ చేసే నియమ నిబంధనల ప్రకారం నూతన దరఖాస్తుల జారీ ప్రక్రియ చేపడతాం.

– ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ జిల్లా ప్రజా రవాణా అధికారి, అమలాపురం

క్లుప్తంగా

ఆర్మీ శిక్షణలో సాయికి పురస్కారం



ఆర్మీ అధికారుల నుంచి పురస్కారం అందుకున్న తోట నాగవెంకటసాయి

సామర్లకోట: సామర్లకోటకు చెందిన తోట గోపి, హైమావతిల కుమారుడు నాగవెంకటసాయి ఆర్మీకి ఎంపికై ఒడిశా రాష్ట్రంలోని గోపాలపురంలో 217 రోజుల పాటు శిక్షణ పొందారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ యూవీ తలూల్ నుంచి పురస్కారం స్వీకరించారు. శిక్షణ పూర్తి కావడంతో గురువారం స్వస్థలం సామర్లకోటకు వచ్చారు. ఈ సందర్భంగా నాగవెంకటసాయి విలేకర్లతో మాట్లాడుతూ శిక్షణ పూర్తి కావడంతో ముంబయిలో ఆర్మీలో ఆపరేటర్ ఫైర్ కంట్రోలర్ పోస్టింగ్ ఇచ్చారన్నారు. ఈ నెల 20న రిపోర్టు చేయాల్సి ఉందని అన్నారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన తరువాత ఆర్మీలోకి చేరాలనే కోరిక ఉండడంతో తన తల్లిదండ్రులు అనుమతించారని చెప్పారు. ఐసెట్ రాసి 1,900 ర్యాంక్ సాధించగా, ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంబీఏకు ఉచిత సీటు వచ్చినా ఆర్మీలో చేరడానికి నిర్ణయించుకున్నానని వివరించారు.

విద్యుత్ మోటార్ చోరీ

అంబాజీపేట: వాకలగరువులో శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ మోటార్, నాగలి సెట్‌లు చోరీకి గురయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. పేరాబత్తుల రామ్మోహనరావుకు చెందిన రూ.15 వేల విలువైన నాగలి సెట్, పేరాబత్తుల నాగేశ్వరరావుకు చెందిన రూ.18 వేల విలువైన విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ మేరకు అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

విత్తుకు పద పద

- విత్తనాలు, ఎరువుల కొనుగోలులో అప్రమత్తత
- కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
- గుర్తింపు పొందినవే మేలు

కాకినాడ సిటీ: తొలకరి సాగుకు సర్వం సన్నద్ధమైంది.. పుడమి పుత్రులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయం దగ్గర పడింది. ఈ నేపథ్యంలో పలు కంపెనీల విత్తనాలు, పురుగు మందుల ప్రచారం జోరందుకుంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయ ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలు సాగిస్తున్నాయి. కంపెనీల యాజమాన్యాలు కాకినాడ జిల్లాలోని డీలర్లకు ప్యాకేజీలు, విదేశీ టూర్లు ఆఫర్ చేస్తున్నాయి. వరి, పత్తి, వేరుశెనగ విత్తనాలకు సంబంధించిన కంపెనీలు ఆయా గ్రామాల్లో రైతులను ఆకట్టుకునేలా వాహనాల్లో వచ్చి కరపత్రాలు, వాల్ పోస్టర్లు, మైక్ సెట్‌ల ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు మార్కెట్‌లకు చేరుతున్నాయి. ఆయా కంపెనీల వలలో రైతులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ప్రకటనలు చూసి మోసపోవద్దు

ఆయా కంపెనీల ప్రకటనలు, ప్రచారాలకు లోబడి విత్తనాలు కొనుగోలు చేయరాదు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో గుర్తింపు లేని లేబుల్‌తో కొన్ని కంపెనీలు నకిలీ విత్తనాలు రైతులకు అంటగడుతున్నాయి. కంపెనీలపై విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్ని సరిచూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. విత్తన కంపెనీపై ప్రభుత్వ నిబంధనల వివరాలు ఉన్నాయో జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా విత్తనాలను ఉత్పత్తి చేసే కంపెనీపై నమ్మకం ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

విత్తనాలు ఎంపిక విధానం

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదా సరి చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనరాదు.
- విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- కొనుగోలు చేసిన సరకును డీలర్ వద్దే తూకం వేయించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యేంత వరకూ భద్రపరచాలి.
- మొలకెత్తే, పూత దశలలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు ఎలా కొనాలంటే..

- అధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే తీసుకోవాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీలు ఉందో లేదో చూడాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనాలి. చిల్లులు పడిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్య పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న విత్తనాల బస్తాలు

పురుగు మందులు కొనే ముందు..

- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగు మందులు కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగు మందుల వాడకానికి వినియోగించే పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించవద్దు.

దళారులను నమ్మవద్దు



ప్రభుత్వ లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్న విత్తనాల రసీదులను రైతుల వద్ద పెట్టుకోవాలి. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. దళారులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దు. ఎక్కడైనా ఇబ్బంది ఎదురైతే అధికారులను సంప్రదించాలి.

–ఎన్.విజయకుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

వైఎస్సార్ సీపీ జెండా స్తూపం తొలగింపు

మండపేట: స్థానిక 16వ వార్డు గొల్లపుంతలో రహదారి పక్కన ఉన్న వైఎస్సార్ సీపీ జెండా స్తూపాన్ని శుక్రవారం టీడీపీ కార్యకర్తలు తొలగించారు. జేసీబీ సాయంతో ఆ స్తూపాన్ని పక్కనే ఉన్న మురుగు కాలువలోకి నెట్టేశారు. మూడేళ్లుగా రహదారి పక్కన ఏ విధమైన ఆటంకం లేకుండా ఉన్న ఈ జెండా స్తూపాన్ని తొలగించడంతో స్థానికులు నివ్వెరపోయారు. ఈ ఘటనను 16వ వార్డు కౌన్సిలర్ మెండు బాపిరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను వారు కోరారు.



మురుగు కాలువలో పడేసిన వైఎస్సార్ సీపీ జెండా స్తూపం

రేపు జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

పిఠాపురం: పిఠాపురంలో ఈ నెల 9వ తేదీ ఆది వారం జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి పోటీలు ప్రారంభమవుతాయని అన్నారు. అండర్ 10, 13, 15 విభాగాల్లో ఇండియన్ రౌండ్, రీకార్వో కాంపౌండ్‌లలో జరుగుతాయన్నారు. క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం, జిరాక్సు కాపీలు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారులు అర్హులన్నారు. ఇతర వివరాలకు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి పి.లక్ష్మణరావు ఫోన్ 99890 01162 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆధ్యాత్మిక భావం పెంచేందుకు కృషి

ఆలమూరు: హిందూ ధర్మ పరిరక్షణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మికభావం పెంపొందించేందుకు దాస సాహిత్య ప్రాజెక్టు కృషి చేస్తోందని టీటీడీ ఆ ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి విద్వాన్ పీఆర్ ఆనందతీర్థాచార్యులు అన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించే వసంత శిక్షణ శిబిరాల్లో భాగంగా రెండు రోజుల శిక్షణ కార్యక్రమం కోసం శుక్రవారం ఆయన ఆలమూరు మండలం గుమ్మిలేరు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారు. వేద ఉపనిషత్ పురాణాల సారాంశాన్ని రంగరించి పురంధరదాసు 4.70 లక్షల సంకీర్తనలను రచించారన్నారు. ఈ కీర్తనలు అన్నీ కన్నడ భాషలో ఉండడంతో తెలుగు వారికి అర్థమయ్యేలా వాటి సారాన్ని వివరించి, ఆయన ఏ సందర్భంలో ఆ కీర్తన రచించారో తెలిపి కీర్తనను ఆలపించే విధానాన్ని భజన మండలి సభ్యులకు నేర్పడానికే ఈ శిక్షణ తరగతులు జరుగుతున్నాయన్నారు. దాస సాహిత్య ప్రాజెక్ట్‌లో భాగంగా కోస్తాలో 4,862 భజనా మండళ్లు ఉండగా, అందులో 8,694 మంది మహిళా సభ్యులు ఉన్నారన్నారు. కోస్తా ప్రాంతంలో దాస సాహిత్య ప్రాజెక్ట్‌లో భాగంగా ఉన్న భజన మండలి సభ్యులు సంకీర్తన యజ్ఞంతో పాటు కోలాటాన్ని మేళవిస్తున్నారన్నారు. టీటీడీ ఈ ప్రాజెక్టు నిర్వహణకు సరిపడా నిధులు అందిస్తూ హిందూ ధర్మ ప్రచారానికి చక్కని తోడ్పాటు అందిస్తుందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానం తెలిపారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భజన మండలి సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనానికి ఏర్పాట్లు కూడా టీడీపీ చేస్తుందన్నారు. అలాగే తీర్థ యాత్రలకు వెళ్లే భక్తులకు కనీస వసతుల కల్పన జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న పీఆర్ ఆనందతీర్థాచార్యులు

ప్రజలకు సంకీర్తలు నేర్పిస్తున్నాం

సముద్ర తీరం ప్రాంతం, కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు, దళితులు సైతం దాస సాహిత్య ప్రాజెక్టు పట్ల ఆసక్తి కనబరుస్తున్నారని ఆనందతీర్థచార్యులు కొనియాడారు. వారందరూ సంకీర్తనలు నేర్చుకునేందుకు ముందుకు వస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక ప్రతిభను కనబర్చుతున్న సంగీత విద్యాంసులు, వేద పండితులను గుర్తించి దాస సాహిత్య ప్రాజెక్టు సభ్యులుగా చేర్చుకుని, వారితో ఆధ్యాత్మికత పెంపు, భజన మండళ్ల ఏర్పాటుకు విశేష కృషి చేస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో హరే శ్రీనివాస భజన మండళ్ల ఏర్పాటులో ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయ నిర్వాహకుడు ముకుంద స్వామి కృషి ప్రశంసనీయమని ఆయన అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలు

కొవ్వూరు: స్థానిక గామన్ ఇండియా వంతెనపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో తమిళనాడులోని తిరుచ్చి జిల్లాలోని కిరపట్టి గ్రామానికి చెందిన దినేష్ కుమార్ అనే లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. దినేష్‌కుమార్ ఐరన్ లోడ్ లారీతో కోల్‌కతా నుంచి కేరళకు వెళుతున్నాడు. గామన్ ఇండియా వంతెనపైకి వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ షడన్ బ్రేక్‌తో ఆగిపోయింది. దాంతో వెనుక వస్తున్న ఐరన్ లారీ ఆ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న ఐరన్ లోడ్ క్యాబిన్‌లోకి చొచ్చుకు వచ్చి గుచ్చుకోవడంతో డ్రైవర్ దినేష్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన దినేష్‌కుమార్‌ను బయటకు తీసి 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి సోదరుడు అజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు తెలిపారు.

లారీని ఢీకొన్న కారు : ఇద్దరికి గాయాలు

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ బ్రిడ్జి వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కైట్ కళాశాల నుంచి ఎర్టిగా కారులో సామర్లకోట శివాలయం, అన్నవరం సత్యనారాయణ మూర్తి ఆలయాల దర్శనానికి ఆరుగురు విద్యార్థులు తెల్లవారు జామున బయలు దేరారు. తూరంగి దాటి చీడిగ మీదుగా వస్తుండగా వంతెన వద్ద రోడ్డు పక్కకు దిగేందుకు గాను ఎడమ వైపునకు బదులుగా కుడి పైపు వస్తూ లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ సీటు పక్కన కూర్చొన్న మచిలీపట్నానికి చెందిన మోడేపల్లి గని మణికంఠకు తలకు గాయం కావడంతో కోమాలోకి వెళ్లాడు. డ్రైవర్ సీటు వెనుక కూర్చున్న విద్యార్థి జయకృష్ణ తలకు గాయాలు కావడంతో వైద్యులు కుట్లు వేసి చికిత్స చేశారు. జయకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మిగిలిన వారందరూ క్షేమంగా ఉన్నారని ఎస్సై మణికుమార్ వివరించారు.

జాతీయ రహదారిపై దంపతులకు గాయాలు

ప్రత్తిపాడు రూరల్: జాతీయ రహదారిపై మండలంలోని ధర్మవరం వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... రాజమహేంద్రవరానికి చెందిన దంపతులు ద్విచక్ర వాహనంపై అన్నవరం వెళ్లి సత్యదేవుని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరం వస్తుండగా ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ వద్దకు వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

సామర్లకోట: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల సివిల్ సప్లయిస్ అధికారి టి.కీర్తి కథనం ప్రకారం.. సామర్లకోట మండలం ఉండూరు గ్రామం నుంచి వీకే రాయపురం రోడ్డులో ఓ వ్యాన్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, నవీన్‌కుమార్‌లు పట్టుకున్నారు. ఈ వాహనంలో 70 బస్తాల్లో ఉన్న సుమారు 3,500 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.5,09,250 ఉంటుంది. పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన బొజ్జ మణికంఠ ఈ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. సామర్లకోట మండల పరిధిలోని వివిధ గ్రామాల రేషన్ లబ్ధిదారుల నుంచి కిలో 20 చొప్పున బియ్యం కొనుగోలు చేసి కోళ్లఫామ్‌లకు రూ.22 చొప్పున విక్రయిస్తున్నట్లు వాహన యజమాని మణికంఠ చెప్పారని ఎంఎస్ఓ వివరించారు. బియ్యం వాహనాన్ని సీజ్ చేసి 6ఏ కింద మణికంఠపై కేసు నమోదు చేశామన్నారు. బియ్యం లోడ్ వాహనాన్ని సామర్లకోట పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఈ దాడిలో విజిలెన్స్ అధికారులు జీవానందం, వీరబాబు, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.



పీడీఎస్ బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

ధారవరంలో..

చాగల్లు: మండలంలోని ధారవరంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్టు సీఎస్‌డీటీ సునీత తెలిపారు. ఆ గ్రామంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన సుమారు 4500 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. బియ్యాన్ని ఊనగట్ల సివిల్ సప్లయిస్ గోదాముకు తరలించినట్టు ఆమె వివరించారు.

మధ్యవర్తిత్వంలో మంచి నైపుణ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 40 గంటల పాటు నిర్వహించిన మధ్యవర్తిత్వ తీర్పు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఆ వివరాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత వెల్లడించారు. ఢిల్లీకి చెందిన సీనియర్ శిక్షకులు వినయ్‌కుమార్ గుప్తా, సునీల్‌కుమార్ అగర్వాల్ ఇచ్చిన శిక్షణ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన న్యాయాధికారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. ఈ శిక్షణలో నేర్పించిన మెళకువల ద్వారా న్యాయాధికారులకు మధ్యవర్తిత్వంలో మంచి నైపుణ్యం లభించిందన్నారు. అనంతరం శిక్షకులు వినయ్‌కుమార్ గుప్తా, సునీల్‌కుమార్ అగర్వాల్‌లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సన్మానించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన 30 మంది న్యాయాధికారులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు, రాజమహేంద్రవరానికి చెందిన న్యాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి.. తగ్గిన దిగుబడి

- అంతంత మాత్రంగా పండ్ల విక్రయాలు
- మార్కెట్ కమిటీకి తగ్గిన ఆదాయం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఈ ఏడాది మామిడి పండ్ల దిగుబడి తగ్గింది.. ఇది వ్యాపారాలపైనా ప్రభావం చూపింది.. దీనివల్ల రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం గణనీయంగా పడిపోయింది. మార్కెట్ కమిటీకి మార్కెట్ ఫీజుతో పాటు యార్డులో మామిడి పండ్ల వ్యాపారం ద్వారా ఆదాయం వస్తుంది. ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో మార్కెట్ కమిటీ ఆదాయం సైతం బాగా మందగించింది. ఆ వివరాలను తెలుసుకుందాం.. మామిడి సీజన్ వచ్చిందంటే రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణ మామిడిపండ్ల వ్యాపారులతో కళకళలాడుతుంది. ఈ వ్యాపారుల నుంచి వచ్చే అద్దెల ద్వారా మార్కెట్ కమిటీకి భారీగా ఆదాయం వస్తుండేది. మార్కెట్ యార్డుకు ఉమ్మడి తూర్పుగోదావరి, మన్యం జిల్లాల నుంచి మామిడిపండ్లు వస్తుంటాయి. రసాలు, బంగినపల్లి, సువర్ణరేఖ, హిమాన్ పసందులు, కొత్తపల్లి కొబ్బరి, పందిరి మామిడి తదితర రకాలు తెస్తుంటారు. వీటిని కొనుగోలు చేసేందుకు రాజమహేంద్రవరం నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. రకాలను బట్టి పరక రూ.450 నుంచి రూ.350, రూ.300 వరకూ విక్రయిస్తుంటారు. గత ఏడాది కంటే ఈ ఏడాది సగానికిపైగా మధుర ఫలాల దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం మార్కెట్ యార్డులో 49 షాపులు మామిడిపండ్ల విక్రయాలు జరుపుతున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నెలలో రూ.61,530 ఆదాయం వస్తే, ఈ ఏడాది రూ.8,160 మాత్రమే రావడం గమనార్హం. గత ఏడాది మే నెలలో రూ.1,62,310 ఆదాయం వస్తే, ఈ ఏడాది రూ.66,840 వచ్చింది. కేవలం మామిడికాయల దిగుబడి తగ్గడం వల్లే ఆదాయం తగ్గుముఖం పట్టిందని అధికారులు చెబుతున్నారు. రైపినింగ్ చాంబర్ అద్దె ద్వారా నెలకు అదనంగా రూ.10 వేలు సమకూరుతుంది.



వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మామిడి పండ్ల విక్రయం



రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

విక్రయదారులకు నష్టం



ఈ ఏడాది మామిడిపండ్ల దిగుబడి బాగా తగ్గింది. వచ్చిన పండ్లను తీసుకువచ్చి రాజమహేంద్రవరం మార్కెట్ యార్డులో విక్రయాలు జరుపుతున్నాం. ఈ ఏడాది మామిడి విక్రయదారులకు తీవ్ర నష్టం జరిగింది. ఎన్నడూ ఈ స్థాయిలో దిగుబడి తగ్గలేదు.

–చాగంటి యేసుబాబు, మామిడి వ్యాపారి, తిరుమలాయపాలెం

ఆదాయం పెంచేందుకు ప్రణాళిక



రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. మామిడి పండ్ల దిగుబడి లేక కొంతమేర మార్కెట్ కమిటీ ఆదాయం తగ్గింది. ప్రజాప్రతినిధుల అంగీకారంతో అరటి మార్కెట్‌తో పాటు, హోల్‌సేల్ ఉల్లిపాయలు, బంగాళాదుంపల మార్కెట్‌ను తీసుకువచ్చేలా ప్రణాళికలు చేస్తున్నాం.–డి.శ్రీనివాస్, ఇన్‌చార్జి ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, రాజమహేంద్రవరం